నడిరోడ్డుపై బోరు.. రాకపోకలకు బేజారు!



అడ్డగుట్ట డివిజన్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ నిమిత్తం డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ మంగళవారం బస్తీల్లో పర్యటించారు. నల్లపోచమ్మ దేవాలయం సమీప బస్తీవాసులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకురాగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి బస్తీలో బోర్ వేయాల్సిందిగా ఆదేశించారు. పవర్‌బోర్ వేయడానికి వచ్చిన వారికి బోర్ వేసేందుకు అనువైన చోటు కనిపించలేదు. బోర్ వాహనం బస్తీలోకి రావడానికి మార్గం లేకపోవడంతో రోడ్డుకు ఒకవైపు వేద్దామనుకున్నా ఆ మార్గంలో డ్రైనేజీ మెయిన్ లైన్ ఉండడంతో చేసేదేమి లేక నడిరోడ్డులో పవర్‌బోర్ వేశారు. బోర్ వేసేవరకు అటుగా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. – అడ్డగుట్ట

లీకేజీల పర్వం.. పట్టించుకోరేం!

బన్సీలాల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో మంచినీటి పైపులైన్ల లీకేజీలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ తాగునీరు వృథాగా పారుతుంది. జలమండలి అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపమే నీటి వృథాకు కారణమని ఆయా ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి వృథాతో రోడ్లు సైతం ధ్వంసమవుతన్నాయి. బోయిగూడ, బన్సీలాల్‌పేట్, పద్మారావునగర్, బోలక్‌పూర్, అభినవనగర్ కాలనీ, ఆర్పీ రోడ్డు, హైదర్‌బస్తీ, రాణిగంజ్, గాంధీనగర్ పరిసర ప్రాంతాల్లో నిత్యం లీకేజీల పర్వం కొనసాగుతూనే ఉంది. పద్మారావునగర్ ప్రధాన రహదారిలో లక్ష్మీఅపార్టుమెంట్ సమీపంలో ప్రధాన రహదారిలో చాలా రోజుల విలువైన నీరు వృథాగా పారుతున్నా పట్టించుకునే నాథులే లేరని ప్రజలు వాపోతున్నారు.
–బన్సీలాల్‌పేట్



మురుగు ఇలా.. అడుగు వేసేదెలా?



అడ్డగుట్టలోని గంగా జమున హోటల్ సమీపంలో డ్రైనేజీ మురుగునీరు పొంగిపొర్లుతూ రోడ్డును ముంచెత్తుతోంది. ఏరులై పారుతున్న మురుగు కారణంగా పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. భారీగా మురుగునీరు నిలుస్తుండటంతో రోడ్డు దాటేందుకు నానా ఇబ్బందులు పడుతున్నామని పాదచారుల వాపోతున్నారు. సమీపంలోనే పాఠశాలలు ఉండటంతో విద్యార్థులు నడిచే క్రమంలో జారీ కింద పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు. – అడ్డగుట్ట

పెచ్చులూడుతున్నాయ్ సారూ.. స్పందించాలి మీరు!



తుకారాంగేట్ మరాఠా బస్తీలో గతంలో ఎకనామికల్ వీకర్ సెక్షన్స్ (ఈడబ్ల్యూఎస్) స్కీమ్ కింద నిర్మించిన ఇళ్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. తమ ఇళ్లకు మరమ్మతులు చేయాలంటూ ప్రజాప్రతినిధులు, అధికారులతో పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఇళ్లలోని పైకప్పులు పెచ్చులూడి ప్రమాదాలు జరిగాయని, మంగళవారం కూడా ఓ ఇంట్లో పెచ్చులూడి కింద పడ్డాయని అదృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. – అడ్డగుట్ట

క్లుప్తంగా

ట్రాలీ వ్యాన్ బీభత్సం

సికింద్రాబాద్: ఓ బాలుడి దుందుడుకు చర్య ఫలితంగా ట్రాలీ వ్యాన్ బీభత్సం సృష్టించింది. ముషీరాబాద్‌కు చెందిన అమీర్ తన టాటా ఏస్ ట్రాలీ వ్యాన్ వాహనాన్ని సీతాఫల్‌మండి రామాలయం వద్ద నిలిపి పక్కకు వెళ్లాడు. అదే సమయంలో అమీర్ వెంట వచ్చిన ఓ 15 ఏళ్ల బాలుడు సదరు వాహనాన్ని స్టార్ట్ చేసి ముందుకు కదిలించే ప్రయత్నం చేశాడు. అదుపు తప్పిన వ్యాన్ ఒక్కసారిగా ముందుకు కదిలి అక్కడే ఆపిన పలు ద్విచక్ర వాహనాలను ఢీకొడుతూ ఓ దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పలు ద్విచక్రవాహనాలు ధ్వంసం అయ్యాయి. పాదచారులు అప్రమత్తంగా ఉండడంతో ప్రమాదం తప్పింది.

హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి

లాలాపేట: జూనియర్ కళాశాల్లో పీడీ పోస్టుల నియామకాల్లో హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా. ఏ. బాలరాజ్, ప్రధాన కార్యదర్శి డా. బి. లక్ష్మయ్య ఓ పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫిజికల్ డైరెక్టర్ల పోస్టుల నియామకాల్లో డబుల్ పీజీ విద్యార్హత కారణంగా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఫిజికల్ డైరెక్టర్ల పోస్టుకు కేవలం మాస్టర్ డిగ్రీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్హత ఉండగా తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమీషన్ ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్లలో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ పీజీ అదనపు డిగ్రీ ఉండాలనీ నిబంధనలు విధించడం వందల మంది నిరుద్యోగులకు అవకాశం లేకుండా పోయిందని దీనిపై ప్రభుత్వ పునరాలోచించాలని కోరారు.

ఆకునూరి మురళీ అక్రమ అరెస్ట్ తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: సోషల్ డెమోక్రటిక్ ఫోరం ఫౌండర్ (ఎస్‌డీఎఫ్), మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళీ అక్రమ అరెస్టును ఖండిస్తూ మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థులు, అధ్యాపకులు నిరసన తెలిపారు. ఈ నెల 30న భూపాలపల్లిలో పేదలకు డబుల్ బెడ్రూమ్‌లు ఇవ్వాలని ఆందోళన చేసిన మురళీని అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యమన్నారు. దేశంలో అత్యున్న ఉద్యోగం ఐఏఎస్‌ను వదిలి పేదల కోసం పోరాడుతున్న మురళీ అరెస్ట్ చేయడం దారుణమని ఆయనను విడుదల చేసి సంపూర్ణ రక్షణ కల్పించాలని ఓయూ ప్రొ.వెంకటదాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రంగనాథ్, రంజిత్, వెంకటేశ్వర్లు, రామేశ్వర్‌రావు, రత్నశేఖర్, సురేష్, సత్యనారాయణ, పరిశోధక విద్యార్థులు రవికిశోర్, నాగేశ్వర్‌రావు, శ్రీనయ్య, పూర్ణచందర్ పాల్గొన్నారు.

స్నేహితురాలిని కలిసేందుకు గూగుల్ సెర్చ్

- ఇల్లు తెలియక బాలిక అదృశ్యం
- గంటలో ఛేదించిన ఇన్‌స్పెక్టర్ మధులత



పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులతో సంయుక్త

అడ్డగుట్ట: అదృశ్యమైన బాలికను గంట వ్యవధిలో ఛేదించి తల్లిదండ్రులకు అప్పగించారు లాలాగూడ ఇన్‌స్పెక్టర్ మధులత. వివరాల్లోకి వెళ్తే.. లాలాపేటలోని సత్యనగర్ కమ్యూనిటీ హాల్ సమీప ప్రాంతానికి చెందిన పడగంటి వేణుకుమార్ కుమార్తె సంయుక్త(10) తార్నాకలోని నారాయణ పాఠశాలలో 6వ తరగతి చదువుతుంది. సోమవారం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన సంయుక్త, కార్తికేయనగర్‌లోని స్నేహితురాలిని కలవాలనుకుంది. ఇల్లు తెలియకపోవడంతో ట్యాబ్‌లో గూగుల్ సెర్చ్ చేసి అది చూస్తూ రాత్రి 7 గంటల నడుచుకుంటూ వెళ్లిపోయింది. సంయుక్త కనిపించడం లేదని గుర్తించిన తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఇన్‌స్పెక్టర్ మధులత ఆదేశాలతో సీసీ పుటేజీలను పరిశీలించగా కార్తికేయనగర్‌కు వెళ్లినట్లు గుర్తించి గంట వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పద్మారావునగర్: ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని ఆ కార్యక్రమాల అమలులో ప్రజలు సహకరించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. రాంగోపాల్‌పేట్ డివిజన్ జీరాలో మంగళవారం ఆయన కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్‌తో కలిసి జీరా వతన్ హోటల్ వద్ద రూ. 12.89 లక్షలు, జీరా ప్లేగ్రౌండ్స్ వద్ద రూ. 12.89 లక్షలతో వీడీసీసీ రోడ్లు, హైదర్‌బస్తీ మహావీర్ కాంప్లెక్స్ వద్ద రూ. 27.83 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలున్నా సకాలంలో స్పందిస్తున్నానని, ప్రజలు సూచించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున వీడీసీసీ రోడ్లను వేస్తూ రహదారుల రూపురేఖలను మార్చినట్లు చెప్పారు. జీరా ప్లేగ్రౌండ్ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. కాలనీ ప్రజలు చక్కని ఆహ్లాదకరమైన వాతావరణంలో సేదతీరేలా అందంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, ఈఈ సుదర్శన్, జలమండలి జీఎం రమణారెడ్డి, హార్టికల్చర్ రాఘవేందర్, బీఆర్ఎస్ నాయకులు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, కాలనీ ప్రతినిధులు చంద్రశేఖర్, రామక్రిష్ణ, నర్సింగ్‌రావు, అభిషేక్ పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తూ..

శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి..

బన్సీలాల్‌పేట్: ఉచిత శిక్షణా కార్యక్రమాలు పేదల జీవితాల్లో వెలుగులు ఇవ్వాలని మంత్రి తలసాని అన్నారు. బన్సీలాల్‌పేట్‌లో మంగళవారం ఎస్ఆర్డీ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ, మగ్గం వర్క్, బ్యూటీషియన్ కోర్సుల శిక్షణా శిబిరాన్ని ఆయన కార్పొరేటర్ హేమలతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత, మహిళలు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నైపుణ్యాలకు పదను పెట్టే శిక్షణ కార్యక్రమాలు పేదలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఎస్ఆర్డీ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి పేదల కోసం ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సొసైటీ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోని పేదల వికాసం, అభివృద్ధికి తమ సంస్థ సామాజిక దృక్పథంలో అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్డీ ప్రతినిధులు శివరాణి, పార్వతీ, ఇంద్రభారతి పాల్గొన్నారు.

ఓయూలో పీహెచ్‌డీ రగడ

వీసీ చాంబర్‌లో బైఠాయింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ రగడ కొనసాగుతుంది. ప్రవేశ పరీక్ష అర్హత మార్కుల తగ్గింపు పై గత వారం రోజులు ఆందోళనలు చేస్తున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం వీసీ ఛాంబర్‌లో బైఠాయించారు. వీసీ లేని సమయంలో ఛాంబర్‌లో ఆందోళన చేపట్టిన విద్యార్థి నేతల తీరును తప్పుపట్టిన అధికారులు, పోలీసులను రంగంలోకి దిగారు. ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్ దత్, కాచిగూడ ఏసీపీ ఆకుల శ్రీనివాస్ నేతృత్వంలో ఓయూతో పాటు ఇతర స్టేషన్ల పోలీసు వీసీ ఛాంబర్‌లో బైఠాయించిన విద్యార్థి నేతలను అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత మార్కులను తగ్గించాలని వినతి పత్రం సమర్పించేందుకు ఛాంబర్‌కు వెళ్లగా వీసీ ప్రొ.రవీందర్ లేకపోవడంతో అక్కడే శాంతియుతంగా నిరసన చేస్తున్న 20 మంది విద్యార్థి నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారని ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి సమస్యలపై ఆందోళనలు చేసే విద్యార్థి నేతలను గుర్తించి ప్రణాళిక ప్రకారం వీసీ కావాలని పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో అనర్హులుగా ప్రకటించి ఓయూ నుంచి బయటికి పంపించాలని కుట్రపూరిత నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థి నేతలు

- ఓయూలో యూజీసీ నిబంధనల ప్రకారం పీహెచ్‌డీ ప్రవేశాల మార్కుల శాతాన్ని నిర్ణయించినట్లు అధికారులు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పీహెచ్‌డీ ప్రవేశాలను రెండు కేటగిరిలుగా చేపడుతున్నామని కేటగిరి–1లో యూజీసీ నెట్ లేదా జేఆర్ఎఫ్ అర్హత గల విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నామని, కేటగిరి–2లో యూజీసీ నిబంధల ప్రకారం ఎంట్రన్స్ పరీక్షలో 50 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు ఉత్తీర్ణులైనట్లని పేర్కొన్నారు.

సిల్వర్ కాంపౌండ్‌లో బీజేపీ బస్తీబాట

రసూల్‌పురా: 'డబుల్' ఇళ్ల సముదాయానికి డిగ్నిటీ కాలనీ అని పేరు పెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం, డిగ్నిటీ పదానికే అర్థం లేకుండా వ్యవహరిస్తున్నారని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ విమర్శించారు. రెండవ వార్డు సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్రూమ్ ప్రాంతంలో మంగళవారం నిర్వహించిన బీజేపీ బస్తీబాటలో ఆయన పాల్గొని స్థానికులతో మాట్లాడారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా హామీలే ఇస్తున్నారే తప్ప కనెక్షన్లు ఇవ్వడం లేదని స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. కంటోన్మెంట్ బోర్డు తరఫున తాగునీటి పైపులైన్ వేసేందుకు సిద్ధంగా ఉన్నామని కానీ.. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ నుంచి అదనంగా మంచినీటి విడుదల చేయిస్తారా అని సవాల్ విసిరారు. కంటోన్మెంట్ బోర్డు ప్రజలకు 90 లక్షల గ్యాలన్ల తాగునీరు అవసరం ఉండగా కేవలం 55 లక్షల గ్యాలన్ల మాత్రమే సరఫరా చేస్తున్నారని దీంతో నీటి ఎద్దడి ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్, స్వామి, ఇర్ఫాన్, జగన్, రామాంజనేయులు, రవి, మల్లేష్, లక్ష్మణ్, జైయాదవ్, ప్రభు, చిట్టిబాబు, సాయికుమార్, సంతోష్ పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న రామకృష్ణ

అభివృద్ధి పనులకు పుష్కలంగా నిధులు తెచ్చాం



చెక్కులు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: పుష్కలమైన నిధులతో సికింద్రాబాద్ నియోజకవర్గంలో పలు ప్రత్యేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ చెప్పారు. మెట్టుగూడ, బౌద్ధనగర్ డివిజన్ల పరిధిలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు రాసూరి సునీత, కంది శైలజతో కలిసి పర్యటిస్తూ షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓ వైపు భారీ అభివృద్ధి పనులు చేపడుతూనే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు విజయపురి కాలనీలో రహదారుల నిర్మాణాలకు రూ. 1.30 కోట్ల నిధులను కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో తీగుళ్ల కిషోర్, రామేశ్వర్‌గౌడ్, కంది నారాయణ, నీల ప్రభాకర్, సుంకు రాంచందర్, వంజరి సతీష్, రాజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

అభినందనలు



ప్రొ.మాధవికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జంతుశాస్త్రం విభాగం అధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రొ.మాధవికి పలువురు విద్యార్థులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. గతంలో నిజాం కాలేజ్ హెడ్, ఎగ్జామినేషన్ తొలి మహిళా కంట్రోలర్‌గా పని చేసిన ప్రొ.మాధవి ఓయూ జంతుశాస్త్రం విభాగానికి హెడ్ కావడం ఆనందంగా ఉందని ఓయూ జేఏసీ రాష్ట్ర నాయకులు వేల్పుకొండ రామకృష్ణ, రీసర్చ్ స్కాలర్ వెంకట్ పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

లాలాపేట: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్ రెడ్డి పేర్కొన్నారు. తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రొ. జయశంకర్ ఇండోర్ స్టేడియంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఆమె సందర్శించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను దేశంలోని ఇతర రాష్ట్రాలు అమలు చేసే స్థాయికి సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతుందని వివరించారు. అన్ని వయసుల వారికి కంటి సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్యారాణి, మోతే శోభన్‌రెడ్డి, అనసూయమ్మ, విజయ, మణెమ్మ పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి

నిర్విరామంగా కంటి వెలుగు

సనత్‌నగర్: ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు–2 నిర్విరామంగా కొనసాగుతోంది. ప్రాంతాల వారీగా కేంద్రాలను ఏర్పాటుచేసి అక్కడ పూర్తిస్థాయిలో పరీక్షలు చేసిన అనంతరం మరోచోట కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోరి బేగంపేట, ఖైరతాబాద్ సర్కిళ్ల పరిధిలో ఒక్కో కేంద్రంలో రోజుకు 100–120 మందికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఖైరతాబాద్ సర్కిల్ పరిధి కిందికి వచ్చే అమీర్‌పేట డివిజన్‌లోని వివేకానంద కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటుచేసి కేంద్రం ద్వారా ఇప్పటివరకు 1080 మందికి స్క్రీనింగ్ టెస్ట్‌లు జరగ్గా అందులో 480 మందికి కళ్లద్దాల పంపిణీ చేసినట్లు సీనియర్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ రేవతి తెలిపారు. సనత్‌నగర్ డివిజన్ పరిధిలోకి వచ్చే అల్లావుద్దీన్ కోఠి కమ్యూనిటీ హాల్లోని కేంద్రం ద్వారా ఇప్పటివరకు 828 మందికి పరీక్షలు నిర్వహించగా 297 మందికి అద్దాలు అందజేశారు. సుందర్‌నగర్ కమ్యూనిటీ హాల్లో 898 మందికి స్క్రీనింగ్ జరగ్గా 371 మందికి అద్దాలు అందజేశారు.

నేటి నుంచి కేంద్రాల మార్పు..

ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని అమీర్‌పేట వివేకానందనగర్ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న కంటి వెలుగు కేంద్రాన్ని ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి బాపూనగర్ కమ్యూనిటీ హాల్లోకి మారుస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా సనత్‌నగర్ డివిజన్‌లోని దాసారం బస్తీ కమ్యూనిటీ హాల్లో కొనసాగుతున్న కేంద్రాన్ని ఉదయ్‌నగర్ కమ్యూనిటీ హాల్లోకి మారుస్తున్నారన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

రసూల్‌పురా: రెండవ వార్డు డబుల్‌బెడ్రూమ్ వాసుల తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించే ప్రతిపాదన పరిశీలిస్తామని కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్‌నాయక్ అన్నారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి అభ్యర్థన మేరకు బోర్డు ఇంజినీరింగ్ విభాగం అధికారి బాలకృష్ణ, ఏఈ ఆదిత్య శానిటరీ ఇన్‌స్పెక్టర్ చౌహాన్‌తో కలిసి ఆయన పలు బస్తీలు, కాలనీల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు.నాలా పూడికతీత పనులతో పాటు గతంలో మంజూరైన సీసీ, బీటీ, డ్రైనేజీ పనులు చేపట్టి, నూతనంగా అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరారు. గన్‌బజార్ మినీ ఫంక్షన్‌హాల్‌కు కిచెన్ , టాయిలెట్ల మరమ్మతుల పనులు చేపట్టాలని, మంజూరైన పనులు వర్క్ ఆర్డర్లు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని సీఈవో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే బోర్డు సమావేశంలో కొన్ని అభివృద్ధి పనులకు నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. నాలాల పూడికతీత పనులు త్వరలో చేపడతామని ఈ విషయమై బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణతో కూడా చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో సూరి, అశోక్, జబ్బార్, మణికంఠ, చిన్నం పాండు, నాగరాజు పాల్గొన్నారు.



మధుకర్‌నాయక్‌కు సమస్యలు తెలుపుతున్న కేశవరెడ్డి

సీవరేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

సికింద్రాబాద్: మురుగు, వరదనీటి సమస్యలకు శాశ్వత ప్రాతిపదికన పరిష్కార మార్గం చూపించే విధంగా సీతాఫల్‌మండి డివిజన్‌లో కాల్వల నిర్మాణం, తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కార్పొరేటర్ సామల హేమ అన్నారు. డివిజన్ పరిధిలోని మహ్మద్‌గూడ, సీతాఫల్‌మండి రామాలయం ప్రాంతాల్లో జరుగుతున్న సీవరేజీ పైప్‌లైన్ల నిర్మాణం పనులను మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. మురుగునీటి సమస్యలు పునరావృతం అవుతున్న ప్రాంతాల్లో భవిష్యత్ అవసరాల దృష్ట్యా రూ.19 లక్షల వ్యయంతో కొత్తలైన్ల నిర్మాణం పనులను చేపడుతున్నామన్నారు. అనంతరం చిలకలగూడ ఉప్పరిబస్తీలోని కంటివెలుగు కేంద్రాన్ని సందర్శించి అక్కడికొచ్చిన వారితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జలమండలి సెక్షన్ ఆఫీసర్ అన్విత్, నాయకులు జాకీర్, విజయలక్ష్మి, జయశ్రీ పాల్గొన్నారు.



పనుల వివరాలు తెలుసుకుంటున్న సామల హేమ

ఉత్సాహంగా సెంటోబుజ్

సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచ్‌కీన్స్ సెంటోబుజ్ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ప్రీ ప్రైమరీ విద్యార్థుల కోసం ఫిబ్రవరి 3 వరకు జరిగే ఈ వేడుకలను మంగళవారం హెచ్‌పీఎస్ సొసైటీ అధ్యక్షుడు గుస్తీ జే నోరియా, ప్రిన్సిపాల్ మాధవ్ దేవ్ సరస్వత్ ప్రారంభించారు. సెంటోబుజ్–వేర్ లెర్నింగ్ ఈజ్ ఫన్ పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా పలు రకాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అలాగే విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించే విధంగా పలు రకాల స్టోరీ బుక్స్‌ను అందించారు. ఈ సందర్భంగా గుస్తీ జే నోరియా మాట్లాడుతూ.. హెచ్‌పీఎస్ వందేళ్ల పండుగ ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి విద్యార్థులు చిన్నవారైనప్పటికీ ఇక్కడ చేపట్టే కార్యక్రమాల్లో వారు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. వారిలో సృజనాత్మకతను పెంపొందించే విధంగా వివిధ రకాల ప్రదర్శనలు ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రిన్సిపాల్ మాధవ్ దేవ్ సరస్వత్ మాట్లాడుతూ.. ప్రాక్టికల్‌గా ప్రాధాన్యమిస్తూ వారిలో సృజనను పెంపొందించేలా శతాబ్ది ఉత్సవాల నిర్వహణను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కల్నల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి అదృశ్యం



రాజు

అమీర్‌పేట: మతిస్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. అమీర్‌పేట బీజేఆర్‌నగర్‌కు చెందిన ఎస్.రాజు (46)కు మతిస్థిమితం సరిగా లేదు. గత నెల 28న సాయంత్రం వాకింగ్ చేసేందుకు వెళ్లి రాత్రైనా రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం సోదరి సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సన్‌స్టోన్ స్కాలర్‌షిప్ పరీక్ష ఫలితాలు 16న

సాక్షి,సిటీబ్యూరో: పన్నెండవ తరగతి విద్యార్థుల కోసం జాతీయస్థాయిలో ఎడ్యుకేషన్ స్టార్టప్ కంపెనీ సన్‌స్టోన్ నిర్వహించిన స్కాలర్‌షిప్ పరీక్ష ఫలితాలు ఈ నెల 16న వెల్లడవుతాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. రూ. లక్ష వరకూ స్కాలర్‌షిప్‌ను విద్యార్థులు గెలుపొందే అవకాశం ఉందని, బీసీఏ, బీబీఏ, బీటెక్‌తో పాటు అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో చేరేవారికి ఈ స్కాలర్‌షిప్ ఉపకరిస్తుందన్నారు. నగరంతో సహా దేశవ్యాప్తంగా రెండు వేల పాఠశాలలకు చెందిన 1.5 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నారన్నారు.

'జాతీయ విద్యా విధానంతో నష్టం'

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జాతీయ విద్యా విధానం పేద కుటుంబాల విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఆలిండియా ఫోరం ఫర్ రైట్ టు ఎడ్యుకేషన్ ప్రాసిడియం మెంబర్ రమేష్ పట్నాయక్ అన్నారు. మంగళవారం ఓయూ గెస్ట్‌హౌస్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జాతీయ విద్య విధానం-పర్యవసానాలు అనే అంశం పై జరిగిన సదస్సులో కన్వీనర్ రజిని, కోకన్వీనర్ ఎన్. సత్య రమేష్‌పట్నాయక్ హాజరై మాట్లాడారు. దేశంలో రిజర్వేషన్లు లేకుండా చేయడమే జాతీయ విద్య విధానం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బోస్, కల్పన, టీవీ సుబ్బరాయన్, డా.సోమసుందర్, డా.నారాయణరావు, స్టాలిన్, నారాయణ, గ్యార నరేష్, ఉదయ్‌కుమార్, బాలరాజు, శివ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

రసూల్‌పురా: మహిళలు స్వయంశక్తితో ఎదిగినప్పుడే ఆర్థిక, సమజాభివృద్ధి జరుగుతుందని శ్రీ గణేష్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ గణేష్ తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన తిరుమలగిరి సెంట్రల్ బజ్రి నాగదేవత, నారాయణ స్వామి ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తన వంతుగా కుట్టు శిక్షణ కేంద్రానికి ట్రైనర్‌ను నియమించడంతో పాటు కావాల్సిన సామగ్రి కూడా సమకూరుస్తానన్నారు. ఆలయ నిర్వాహకులు మహిళల కోసం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని, పేద మహిళలకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు.



కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన శ్రీ గణేష్